క్లుప్తంగా

తిరుమలేశుని సన్నిధిలో విశేష పూజలు

నల్లజర్ల: అనంతపల్లిలో కొలువైన ఆనంద తిరుమల వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ వేడుకల రెండో రోజైన మంగళవారం విశేష పూజలు జరిగాయి. బుధవారం ఉదయం ప్రతిష్ఠించే ధ్వజస్తంభం, నాగులపుట్ట, నాగబంధం, అభయాంజనేయ స్వామి విగ్రహాలకు మంగళవారం ఉదయం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, పరిషత్ ప్రయాచిత్త హోమం, వాస్తుపూజ, సప్త కలశారాధన, నవకలశారాధన, పంచగవ్య, ఆరాధన, అగ్నిప్రతిష్ఠ తదితర క్రతువులను పెదపూడి విజయ వెంకటరమణ, వాడపల్లి శశికాంత్ ఆచార్యుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

22 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



మునిపల్లి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగభూషణం తదితరులు

నిడదవోలు రూరల్: రబీ సీజన్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వి.నాగభూషణం సూచించారు. నిడదవోలు మండలంలోని 22 ఆర్‌బీకేల వద్దా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం తహసీల్దార్ నాగభూషణం, వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఓ సత్యనారాయణ మాట్లాడుతూ ధాన్యం సేకరణ కోసం మండలంలో 5.50 లక్షల గోనెసంచులను సిద్ధంగా ఉంచామన్నారు. పారదర్శకంగా ధాన్యం కొనుగోలుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించామన్నారు. రైతులకు ఏమైనా ఇబ్బందులుంటే, తమ దృష్టికి తెస్తే తక్షణమే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమాల్లో పౌరసరఫరాల విభాగం డీటీ ఎం.అనిల్‌కుమార్, సచివాలయ అగ్రికల్చరల్ అసిసెంట్లు, రైతులు పాల్గొన్నారు.

హోం ఓటింగ్‌కు 39 దరఖాస్తులు

తాళ్లపూడి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో హోం ఓటింగ్‌పై మంగళవారం మండలంలోని పైడిమెట్ట, ప్రక్కిలంక గ్రామాల్లో అధికారులు సర్వే నిర్వహించారు.ఈ రెండు గ్రామాల్లో 85 ఏళ్లు పైబడిన వృద్ధుల, 40 శాతానికి పైబడి అంగవైకల్యం ఉన్న వారి ఇళ్ల వద్దకు పోలింగ్ అధికారులు వెళ్లారు. ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకుంటారా? లేక పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేస్తారా? అనే అంశంపై వారి నుంచి దరఖాస్తులు తీసుకున్నట్టు పోలింగ్ సూపర్‌వైజర్ జె. వెంకటేశ్వరరావు చెప్పారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రకారం పోలింగ్ సిబ్బంది మండలంలో సర్వే నిర్వహించి హోం ఓటింగ్‌కు అర్హులైన 744 మందిని గుర్తించామన్నారు. వారిలో 39 మంది మాత్రం ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకుంటామంటూ డిక్లరేషన్ ఇచ్చారని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో బూత్ లెవెల్ అధికారులు కవిత, శాంతి, విజయ పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్వారీ లారీ కార్మికుల సమ్మె

దేవరపల్లి: తమ వేతనాలు పెంచాలని యజమానులను డిమాండ్ చేస్తూ దుద్దుకూరులో క్వారీ సింగిల్ లారీ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. మంగళవారం నాటికి సమ్మె 11వ రోజుకు చేరుకుంది. వేతనాలు పెంచే విషయంలో యాజమాన్యం నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు పెంచే వరకు సమ్మె విరమించేది లేదని కార్మిక సంఘం నాయకులు ఎస్‌కే మస్తాన్ తెలిపారు. సమ్మె శిబిరం వద్ద కార్మికులు వంటా వార్పు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ, సొసైటీ అధ్యక్షుడు కాండ్రు రామకృష్ణ, పలువురు నాయకులు శిబిరాన్ని సందర్శించి కార్మికులకు సంఘీభావం తెలిపారు.

బీఎస్పీ అభ్యర్థి ఎన్నికల ప్రచారం

ఉండ్రాజవరం: బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మాపు చిత్రసేన్ మండలంలోని సూర్యారావుపాలెం గ్రామంలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్, కాన్షీరాం ఆశయాలు బీఎస్పీతోనే నెరవేరతాయన్నారు. గ్రామస్తులు బీఎస్పీకి ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ప్రచారంలో నల్లి రమేష్, మద్రి మహాలక్ష్ముడు, చల్లాబత్తుల సత్యనారాయణ, బత్తిన ఆశీర్వాదం, కప్పల ఇశ్రాయిల్, గుమ్మాపు వాసు తదితరులు పాల్గొన్నారు.

ముప్పిడి గైర్హాజర్‌పై అసంతృప్తి

తాళ్లపూడి: అన్నదేవరపేటలో ఇటీవల నిర్వహించిన కాపుల ఆత్మీయ సమావేశానికి జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు హాజరు కాకపోవడాన్ని రావూరుపాడుకు చెందిన జనసేన నాయకుడు సిద్దా శివరామకృష్ణ తప్పుబట్టారు. ముప్పిడి చర్యను కాపు సామాజిక వర్గం అవమానంగా భావిస్తోందని మంగళవారం ఆయన వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే అభ్యర్థి వైఖరిని గమనిస్తే భవిష్యత్తులో కూడా కాపులు జెండాలు మోసే కూలీలు గానే ఉండలా? అన్న సందేహం కలుగుతోందన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మళ్లీ గెలిపిద్దాం

- హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత
- గడప గడపకూ వనితమ్మ పేరుతో ఘంటావారిగూడెంలో ఎన్నికల ప్రచారం



ఘంటావారిగూడెంలో గడప గడపకూ వనితమ్మ పేరుతో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి తానేటి వనిత

నల్లజర్ల: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆశీర్వదించి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని హోం మంత్రి, ఆ పార్టీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గడప గడపకూ వనితమ్మ కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాయంత్రం ఆమె మండలంలోని ఘంటావారిగూడెంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఇమ్మణ్ణి సత్తిపండు, ఎంపీటీసీ సభ్యురాలు యలమర్తి సూర్యకుమారి, పార్టీ నాయకుడు వాసుబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి వనిత పార్టీ శ్రేణులతో కలసి ఇంటింటికీ వెళ్లారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా ఈ ఐదేళ్లలో అందిన సంక్షేమం, నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రజలకు జరిగిన మేలును వివరించారు. ఎన్నికల వేళ టీడీపీ నాయకులు చెప్పే మాయ మాటలను నమ్మి మోసపోవద్దని ఆమె గ్రామస్తులను కోరారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటేసి వైఎస్సార్ సీపీని మరోసారి అధికారంలోకి తీసుకు రావాలన్నారు. తనను ఎమ్మెల్యే గాను, డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను రాజమహేంద్రవరం ఎంపీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో ఎంపీపీ బంక జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు ముప్పిడి లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు వామిశెట్టి పావనీకుమారి, పార్టీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, నాయకులు కారుమంచి రమేష్, బంక అప్పారావు, తొమ్మండ్రు రమేష్, ముప్పిడి వెంకటరత్నం, ఈలప్రోలు చంద్రరావు, పంది సత్యనారాయణ, చేబ్రోలు బాలాజీ, సయ్యద్ మునాఫ్, తోట వెంకట్రావు, జువ్వలపాలెపు అన్నవరం, మద్దూరి నాగేశ్వరరావు, నక్కా పండు, రాజ్‌కుమార్‌లతో పాటు వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేనల నుంచి వైఎస్సార్ సీపీలోకి..



తొక్కిరెడ్డిగూడెంలో వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి ఆహ్వానించిన మంత్రి వనిత



నడుపల్లికోటలో వైఎస్సార్ సీపీలోకి చేరిన తెలుగుదేశం, జనసేన నాయకులు

గోపాలపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత అన్నారు. మండలంలోని తొక్కిరెడ్డిగూడెంలో సోమవారం రాత్రి నిర్వహించిన ఇంటింటా ఎన్నికల ప్రచారంలో తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన 20 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ వనిత పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, మహిళా కన్వీనర్ యండపల్లి కవిత, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నడుపల్లికోటలో 20 మంది..

పెరవలి: వైఎస్సార్ కాంగ్రెస్ సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలోను, నియోజవర్గంలోను జరిగిన అభివృద్ధికి ఆకర్షితులై తెలుగుదేశం, జనసేన పార్టీల నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ఆ పార్టీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్ నాయుడి కుమారుడు వరుణ్ సాయి అన్నారు. మండలంలోని నడుపల్లికోటలో మంగళవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ రెండు పార్టీలకు చెందిన 20 మంది బీసీ, ఎస్సీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వరుణ్‌సాయి మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వంలోని నాయకులు ఇసుక, మట్టి దోపిడీ చేశారన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో అలాంటి అవినీతి పనులకు దూరంగా ఉండడమే కాకుండా నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపామన్నారు. మరోసారి ప్రజలందరూ తమకు అండగా ఉండాలని కోరారు. టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన వారిలో చిటికెన సత్తిబాబు, ఆరేపల్లి నరేష్, చిటికెన శ్రీను, దాసరి వెంకటరమణ ఉన్నారు. అలాగే జనసేన నుంచి చేరిన వారిలో కాకర్ల శివాజీ, కప్పల అనిల్, గుండాబత్తుల వాసు, కాళహస్తి సురేష్, నల్లి రాజేష్, ఇలపాటి పండు, మట్టాడి పృథ్వీ, చీలి భీమరాజు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బీరా సత్యవేణి రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్‌ది ప్రజాహిత పాలన



ఊనగట్ల ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు, పార్టీ పరిశీలకుడు రాజీవ్ కృష్ణ తదితరులు

- వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి
- ఊనగట్లలో ఇంటింటా ప్రచారం
- హాజరైన ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌కృష్ణ

చాగల్లు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారని వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు అన్నారు.మండలంలోని ఊనగట్ల గ్రామంలో మంగళవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాశీర్వాదం పేరిట ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు ఎస్.రాజీవ్‌కృష్ణ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి జగన్ అధికారంలోకి వచ్చాక చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు వివరించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజా సమస్యలపై ఆరా తీశారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా జగనన్న మెరుగైన పాలన అందించారని అన్నారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ ఏ గడపకు వెళ్లినా చిరునవ్వులతో ప్రజలు తమను ఆహ్వానిస్తున్నారన్నారు. ప్రచారంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, ఎంపీపీ మట్టా వీరాస్వామి, జెడ్పీటీసీ సభ్యురాలు గారపాటి విజయదుర్గ, శ్రీనివాస్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, సర్పంచ్ మట్టా వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యుడు ఆత్కూరి గోపిచంద్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ముస్లింలకు అండగా ఉంటా

నిడదవోలు: రంజాన్ మాసం సందర్భంగా పట్టణంలోని జామియా పెద్ద మసీదులో మంగళవారం నిర్వహించిన ఇఫ్తార్ విందుకు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ముఖ్య అతిథిగా హాజరై, ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థన చేశారు. ముస్లింలకు ఏ సమస్య వచ్చినా ఎల్లవేళలా అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. మసీదు కమిటీ ఆధ్వర్యంలో శ్రీనివాస్‌నాయుడిని సత్కరించారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, జిల్లా వక్ఫ్ బోర్డ్ ఉపాధ్యక్షుడు ఎస్‌కే వజీరుద్దీన్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, మసీదు ముతవల్లి అజీజ్ బాషా, కార్యదర్శి రోషన్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ముంగంటి కృపానందం, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీపై టీడీపీ ఆరోపణలు అసత్యం



ఎంపీపీ పోశిరాజు

తాళ్లపూడి: ఈ నెల సామాజిక పెన్షన్ల పంపిణీ ఆలస్యం కావడం నుంచి విపక్ష టీడీపీ రాజకీయంగా లబ్ధి పొందాలని చూడడాన్ని, ప్రభుత్వంపై బురద జల్లడాన్ని మానుకోవాలని ఎంపీపీ జొన్నకుటి పోసిరాజు అన్నారు. తాళ్లపూడిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మార్చి నెలాఖరు, ఏప్రిల్ ఫస్ట్ కావడం వల్ల బ్యాంకు ఆర్థిక లావాదేవీలకు అవకాశం లేనందునే మాత్రమే పెన్షన్ల పంపిణీ ఆలస్యమైందన్నారు. ప్రభుత్వం అప్పులు పాలైందని, పెన్షన్ల పంపిణీకి నిధులు లేవని విపక్షాలు ప్రచారం చెయ్యడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పెన్షన్ల పంపిణీకి ఆటంకం కలిగించేందుకు, ప్రతి నెలా వాటిని పంపిణీ చేసే వలంటీర్లపై అభియోగాలు మోపి ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేసి, వారిని ఆ విధుల నుంచి తప్పించిన పాపం టీడీపీదే అని గుర్తు చేశారు. టీడీపీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా వైఎస్సార్ సీపీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ఎంపీపీ పోసిరాజు పేర్కొన్నారు.

పాపన్న గౌడ్‌కు నివాళి



పాపన్న గౌడ్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న గూడూరి శ్రీనివాస్, తలారి వెంకట్రావు

కొవ్వూరు: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 314వ వర్ధంతి సందర్భంగా మంగళవారం పట్టణ శివారున హైవే జంక్షన్ వద్ద గల ఆయన విగ్రహానికి వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టా వీరబాబు, చాగల్లు ఎంపీపీ మట్టా వీరాస్వామి పాల్గొన్నారు.

చర్చ లేకుండానే ముగిసిన మండల పరిషత్ సమావేశం

నల్లజర్ల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ బంక జయలక్ష్మి అధ్యక్షతన మంగళవారం సాయంత్రం జరిగింది. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున అజెండా, చర్చలు, గ్రామాల్లోని సమస్యల ప్రస్తావన లేకుండానే సమావేశం ముగిసినట్టు ఎంపీడీఓ నరేష్ కుమార్ వెల్లడించారు. డిప్యూటీ తహసీల్దార్ కిశోర్‌కుమార్ సార్వత్రిక ఎన్నికల కోడ్ ఆఫ్ కాండక్ట్ గురించి, ఏవో కమల్‌రాజ్ రబీ ధాన్యం కొనుగోలు గురించి సభ్యులకు వివరించారు. మండలంలో 14 కేంద్రాల్లో ఈ నెల 9 నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం అవుతాయని చెప్పారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పింఛన్ల పంపిణీ రోజుల్లో ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు సచివాలయాలు పని చేస్తాయన్నారు. వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ, జెడ్పీటీసీ సభ్యురాలు ముప్పిడి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో ప్రతి ఇంటా లబ్ధిదారులు

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- తాళ్లపాలెంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం

నిడదవోలు రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంట్లోనూ సంక్షేమ పథకాల లబ్ధిదారులు ఉన్నారని ఎమ్మెల్యే, ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని తాళ్లపాలెంలో మంగళవారం ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. వలంటీర్లను చూస్తే చంద్రబాబుకు వణుకు పుడుతోందని విమర్శించారు. ప్రతి ఒక్కరూ రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను భారీ మెజార్టీలతో గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఎంపీటీసీ సభ్యుడు బయ్యే కృష్ణబాబు, స్థానిక నాయకులు వంగూరి రాజశేఖర్, సింగులూరి వెంకటేశ్వరరావు, వారా ఉమామహేశ్వరరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



తాళ్లపాలెంలో వైఎస్సార్ సీపీ ఎన్నికల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, పార్టీ శ్రేణులు

పట్టణంలో మున్సిపల్ చైర్మన్ ప్రచారం

నిడదవోలు: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడి తరఫున మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ పట్టణంలోని రెండో వార్డులో మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు. పార్టీ శ్రేణులతో కలసి ఆదినారాయణ ఇంటింటికీ వెళ్లారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో నిడదవోలు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న జి. శ్రీనివాస్ నాయుడు, డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ల విజయానికి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన అభ్యర్థించారు. పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు ముంగండి కృపానందం, వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ



గోపాలపురంలో ఓటు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్వో శివజ్యోతి, తహసీల్దార్, ఎంపీడీఓ తదితరులు



నిడదవోలు సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో వెంకటరమణ నాయక్

గోపాలపురం: ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, దానిని వయోజనులందరూ సద్వినియోగం చేసుకోవాలని గోపాలపురం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె. శివజ్యోతి అన్నారు. ఓటు హక్కు ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మంగళవారం గోపాలపురంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నుంచి బస్‌స్టాండ్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో శివజ్యోతి మాట్లాడుతూ ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశమై, ప్రశాంత వాతావరంలో ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. తహసీల్దార్ డి.వనజాక్షి, ఎంపీడీఓ కె. రమేష్‌బాబు పాల్గొన్నారు.

నిడదవోలు: ఎన్నికల నియమావళిని అన్ని రాజకీయ పార్టీలూ కచ్చితంగా పాటించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటరమణ నాయక్ కోరారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. అభ్యర్థులు ఎన్నికల నామినేషన్ పత్రాలు దాఖలు చేసేటపుడు ఎలాంటి విధివిధానాలు పాటించాలో ఈ సందర్భంగా ఆర్వో వెంకటరమణ నాయక్ వివరించారు. మున్సిపల్ కమిషనర్ రాంభూపాల్‌రెడ్డి, నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల తహసీల్దార్లు వి. నాగభూషణం, కె.నవీన్‌బాబు, డి.సుధ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి అండగా ఉందాం

వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్

తాళ్లపూడి: సంక్షేమ సారథి అయిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో అందరూ అండగా నిలిచి, గెలిపించుకోవాలని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. తిరుగుడుమెట్ట గ్రామంలో మంగళవారం రాత్రి ఆయన ఆ పార్టీ నాయకులతో పరిచయ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆ గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. తాను స్థానికంగా అందుబాటులో ఉంటానన్నారు. స్థానికేతరులు వచ్చి పోటీ చేస్తున్నారని కుటుంబంలో ఎవరు ఏ పార్టీయో చెప్పలేని పరిస్థితి ప్రత్యర్థి పార్టీదన్నారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించడానికి కృషి చేయాలన్నారు. పార్టీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, నాయకులు వల్లభశెట్టి చిన్ని, గూడా విజయరాజు, నక్కా చిట్టి బాబు, గండి రాంబాబు, నామా శ్రీనివాస్, కోనాల వీర్రాజు , నరాలశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'వీరమళ్లు'కు పుత్ర వియోగం

- అనారోగ్యంతో శ్రీనివాస్ మృతి
- నివాళులు అర్పించిన ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్‌నాయుడు



వీరమళ్లు సత్యనారాయణ కుమారుడి మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్ నాయుడు

పెరవలి: వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ల సత్యనారాయణ కుమారుడు శ్రీనివాస్ (48) మృతి చెందాడు. మూడు రోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురైన శ్రీనివాస్‌ను రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీనివాస్ సోమవారం రాత్రి మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని మంగళవారం ఉదయం మండలంలోని ఉసులుమర్రు గ్రామంలోని వారి స్వగృహానికి తీసుకు వచ్చారు. నిడదవోలు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్ నాయుడు ఉసులుమర్రు చేరుకుని, శ్రీనివాస్ మృతదేహంపై పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ శ్రీనివాస్ హఠాత్తు మరణం వీరమళ్ల సత్యనారాయణ కుటుంబానికి తీరని లోటన్నారు. శ్రీనివాస్ మరణం బాధాకరమన్నారు. సత్యనారాయణను ఓదార్చారు. ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు మృతదేహానికి నివాళులు అర్పించారు.

నేటి నుంచి సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ

నిడదవోలు: పట్టణంలోని 13 సచివాలయాల వద్దా బుధవారం నుంచి లబ్ధిదారులకు సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ టి. రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ‘సాక్షి’తో మాట్లాడారు. వెల్ఫేర్ అసిస్టెంట్‌తో పాటు మిగిలిన సచివాలయ సిబ్బంది లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తారన్నారు. ఏఎన్ఎంలు తప్ప మిగిలిన సిబ్బంది అంతా పింఛన్ల పంపిణీలో భాగస్వాములవుతారన్నారు. డయాలసిస్ రోగులకు, మంచానికే పరిమితమైన వారికి, కనీసం నడవలేని వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తారని కమిషనర్ వివరించారు. పట్టణంలోని అన్ని రకాల పింఛనుదారులు కలిపి 3,390 మంది ఉన్నారని, వారికి రూ.1.32 కోట్లు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఆయనతో పాటు మున్సిపల్ రెవెన్యూ అధికారి ఆర్. వెంకటేశ్వరరావు కూడా పాల్గొన్నారు.

దేవరపల్లిలో..

దేవరపల్లి: ఏప్రిల్ నెల సామాజిక పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది. బుధవారం నుంచి ఐదు రోజుల గ్రామ సచివాలయాల వద్ద సిబ్బంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తారు. ఇందుకోసం అధికారులు సచివాలయాల వద్ద ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉదయం 11 గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభమవుతుందని ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులకు గ్రామ సచివాలయ సిబ్బంది ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేస్తారని తెలిపారు. మండలంలోని 21 గ్రామ సచివాలయాల్లో 11,643 మంది పింఛనుదారులు ఉన్నట్టు చెప్పారు. గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 44,627 మందికి పింఛన్లు అందజేస్తారు. దేవరపల్లి మండలంలో 11,741, గోపాలపురం మండలంలో 10,580, నల్లజర్ల మండలంలో 12,137 , ద్వారకాతిరుమల మండలంలో 10,142 మందికి పింఛన్ల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేశారు.

120 లీటర్ల సారా స్వాధీనం

గోపాలపురం: గోపాలపురం పంచాయతీ పరిధిలోని గుడ్డిగూడెం శివారు వడ్డమాని చెరువు వద్ద నిర్వహిస్తున్న సారా తయారీ కేంద్రంపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. కొవ్వూరు డీఎస్పీ కేసీహెచ్ రామారావు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ దాడిలో దేవరపల్లి సీఐ కె.బాలసురేష్ , గోపాలపురం ఎస్ఐ కర్రి సతీష్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ నామాల దొరబాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా 120 లీటర్ల సారాను, సారా తయారీకి ఉపయోగించే మూడు గ్యాస్ సిలిండర్లను, బెల్లాన్ని, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే సుమారు ఐదు వేల లీటర్ల బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేసినట్టు గోపాలపురం ఎస్ఐ సతీష్‌కుమార్ చెప్పారు. అలాగే ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్సై చెప్పారు.